## వైభవంగా అఖండ శ్రీరామ నామ స్మరణ


పూజల్లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 అయ్యప్ప స్వామి ఆలయ సముదాయంలోని శ్రీకృష్ణ గోశాల ఆవరణలో అఖండ శ్రీరామ నామ స్మరణ ఘనంగా జరుగుతోంది. హనుమాన్ జన్మోత్సవ సమితి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా 24 గంటలు రామనామ జపం చేస్తున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్లు సతీష్ కుమార్ జాదు, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్ తదితరులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 23 వరకు కొనసాగే ఈ అఖండ రామనామ స్మరణలో 15 మంది వేద పండితులు పాల్గొని నిరంతరాయంగా భజనలు చేస్తున్నారు. గుజరాతీ ఏక్తా మహోత్సవ్ చైర్మన్, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌పటేల్ మాట్లాడుతూ... రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో హారతి, మహా హారతి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. సీతారాములకు విశేష పూజలు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు, భజనల్లో పాల్గొనాలని వారు కోరారు.

# 'ఎస్కీ' ఇక ఎవర్‌గ్రీన్

'లోకల్'కు ప్రాధాన్యం.. ఉపాధి ఆధారిత కోర్సులపై ప్రత్యేక దృష్టి


ఎస్కీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇకపై 'ఎస్కీ'లో స్థానికతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు నాయకత్వంలో చర్యలు చేపట్టారు. 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ద్వారా ఏర్పాటు చేయబడిన స్వయం ప్రతిపత్తి సంస్థగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఇంజనీర్లు, మేనేజర్లకు నిరంతరం శిక్షణను అందించడంతోపాటు ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను కూడా అందిస్తుంది. ఎస్కీ అనేక ప్రముఖ ఇంజనీర్లు, నిర్వాహకులు, విద్యావేత్తలతో అధికారిక సంబంధాలను కలిగి ఉంది. వారు అనుబంధ అధ్యాపకులు, కన్సల్టెంట్‌లుగా కూడా పనిచేస్తున్నారు. అంతేకాకుండా పలు రకాల కోర్సులను కూడా నిర్వహిస్తూ ఐఎస్‌బీ తరహాలో ఉన్నత విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుతోంది.


'ఎస్కీ'లో సమావేశాల కోసం నిర్మించిన చాణక్య భవనం



'ఎస్కీ'లోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ భవనం

**ఇక స్థానికులకు అత్యంత ప్రాధాన్యత..**

- 'ఎస్కీ'లో ఉన్నత విద్యాభివృద్ధి కోసం బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటు చేసి దానికి 'స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్'గా నామకరణం చేశారు.
- ఏఐసీటీఈ అనుమతితో ప్రస్తుతానికి పీజీ డిప్లొమో రెండేళ్ళ కోర్సులను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని కోర్సులను నిర్వహించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ కోర్సుల్లో చేరే వారిలో ఈ ఏడాది నుంచి స్థానికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.
- ప్రతి యేటా రెండేళ్ల ఫుల్‌టైమ్ పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, పీజీడీఎం ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ వంటి కోర్సులను నిర్వహిస్తోంది.

**'ఎస్కీ టెక్నో హబ్' ఏర్పాటుకు చర్యలు**

- గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో డీ ల్యాబ్స్, ట్రిపుల్‌ఐటీలోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ), హెచ్‌సీయూలోని ఆస్పైర్ బయోనెస్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లను స్ఫూర్తిగా తీసుకొని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో కూడా త్వరలోనే 'ఎస్కీ టెక్నోహబ్'ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు.
- ఇక్కడ చదివే విద్యార్థులకు స్టార్టప్ కల్చర్‌పై మరింతగా అవగాహన పెంచేలా నూతన ఆవిష్కరణలు రూపొందేలా చేయడానికి చర్యలు చేపడుతారు.
- ముఖ్యంగా ఈ హబ్ ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్‌తోపాటు కో వర్కింగ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తగిన ప్రణాళికతో దీనికి రూపకల్పన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**మార్చిలో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం**

- నగర శివారులో అత్యాధునిక సౌకర్యాలతో కన్వెన్షన్ సెంటర్‌ను మార్చిలో ఎస్కీ ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఒకేసారి 800 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 100,150 మందికి వేర్వేరుగా, మరో 50 మందికి ఒకేసారి నాలుగు చోట్ల శిక్షణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించేలా నాలుగు ప్రత్యేక సెమినార్ హాళ్ళను నిర్మించారు.
- ఇదిలావుండగా ప్రస్తుతానికి 100 గదుల్లో 200 మంది శిక్షణ కోసం వచ్చే వారు వసతి పొందేలా ఏర్పాట్లు ఉండగా దీన్ని మరింత రెట్టింపు చేయాలనే ప్రతిపాదనలు చేశారు.

**యూనివర్సిటీ హోదా వచ్చేలా..**



కొత్తగా ఎస్కీ టెక్నో హబ్ ఏర్పాటు చేస్తున్నాం. దీని ద్వారా ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్, కో వర్కింగ్ స్పేస్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించాం. 2024లో యూనివర్సిటీ హోదా వచ్చేలా చొరవ తీసుకుంటాం. ఎస్కీ రూపురేఖలే మారుతాయి. స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేషన్ సెంటర్‌లో చేరేవారిలో లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పించాం. జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో అనేక కార్యక్రమాలను ఈ ఏడాది నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడుతున్నాం.

– డా.రామేశ్వరరావు, ఎస్కీ డైరెక్టర్

## కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 60–70, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 25, చామ 60, కీర 25, బీర 60, వంకాయ 40, గోకర 80, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 50, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 250.

## దరఖాస్తుల గడువు తేదీ పెంపు

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాల(సీఓఈ)ల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీని ఈనెల 20వ తేదీ వరకు పొడగించడమైనదని గౌలిదొడ్డి గురుకుల బాలుర ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. జనవరి 15వ తేదీ వరకు ఉన్న గడువును 20వ తేదీ వరకు పొడిగించడమైందని తెలిపారు. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

## అభివృద్ధిలో పరిశోధనలు కీలకం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్

రాయదుర్గం: ఏ సంస్థలోనైనా అకడమిక్ ఎదుగుదలలో పరిశోధనలు ప్రముఖపాత్ర పోషిస్తాయని 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ పేర్కొన్నారు. మనూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్ అండ్ ఐటీ) విభాగం ఆధ్వర్యంలో 'కంప్యూటర్ సైన్స్‌లో ఎమర్జింగ్ రీసెర్చ్ ట్రెండ్స్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. సమకాలీన కంప్యూటర్ సైన్స్ పరిశోధనను రూపొందించే తాజా పురోగతులు, పద్ధతులు, ఇంటర్ డిసిప్లినరీల సహకారంపై మరింత అవగాహన అధ్యాపకులకు అవసరమన్నారు. సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పరిశోధనా కార్యకలాపాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ ఇంతియాజ్‌హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్ మోహతేషామ్‌షాఖాద్రీ, కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖలీదా అఫ్రోజ్ పాల్గొన్నారు.

## గీతం అధ్యాపకుడికి సెర్చ్ పరిశోధనా ప్రాజెక్టు

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొ.డాక్టర్ సుధాకర్ సింఘాకు భారత ప్రభుత్వం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (సెర్చ్) పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ జిల్లాలో కృత్రిమ మేథ/ మెషీన్ లెర్నింగ్ ఆధారంగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక మూల్యాంకనం ప్రాజెక్టును, రూ.32.03 లక్షల గ్రాంట్ తో సెర్చ్ రీసెర్చ్ గ్రాంట్‌గా 36 నెలల కాల వ్యవధితో మంజూరు చేసినట్టు వివరించారు.భూగర్భ జల వనరుల స్థిరమైన అభివృద్ధి దిశగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక అంచనా కోసం కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ పద్ధతులను ఉపయోగించడంలో డాక్టర్ సింఘాకు ఉన్న నైపుణ్యం ఈ పరిశోధనలో తోడ్పడనున్నట్టు పేర్కొన్నారు.గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, వివిధ విభాగాధిపతులు, పలువురు అధ్యాపకులు సింఘాకు అభినందనలు తెలిపారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఆర్టీసీ కాలనీ(మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ల్యాండ్‌మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- మదీనాగూడ ఫీడర్ పరిధిలో.. ఉ.11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు కల్కి హైట్స్, రామకృష్ణనగర్, కల్లెం అంజిరెడ్డి స్కూల్, పైప్‌లైన్ రోడ్డు, యశోద పెరల్, మదీనాగూడ మసీద్ ఏరియా, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.
- వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో.. 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.
- శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు శ్రీరాంనగర్, ఆర్ఎస్ బ్రదర్స్, వీఆర్‌కె సిల్క్స్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, హరిజన బస్తీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు బీహెచ్‌ఈఎల్ ప్రధాన రోడ్డు, చందానగర్ పోలీస్ స్టేషన్, గౌతమీనగర్, ఓల్డ్ బొంబాయి రోడ్డులలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

**చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

శేరిలింగంపల్లి: 33/11 కేవీ చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైల్ విహార్, రామయ్యనగర్, వెజ్ మార్కెట్, ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, తారానగర్, శాంతినగర్, హుడాకాలనీ, చందానగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

- రైల్ విహార్ ఫీడర్ పరిధిలో.. సాయిబాబ టెంపుల్ ఏరియా, సిటిజన్ కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్‌పంపు బ్యాక్ ఏరియా, గిడ్డంగి ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తారు.
- రామయ్యనగర్ ఫీడర్ పరిధిలో.. హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, రైల్‌విహార్, ఓల్డ్ లింగంపల్లి రైల్వే స్టేషన్ ఏరియాల్లో ..
- వెజ్ మార్కెట్ ఫీడర్ పరిధిలో.. లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, వెజిటెబుల్ మార్కెట్ ఎస్ఎం లేఅవుట్ ఏరియాల్లో..
- ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో..ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, ఓల్డ్ పోలీస్ స్టేషన్ రోడ్, గంగారం విలేజ్ ఏరియాల్లో
- తారానగర్ ఫీడర్ పరిధిలో.. వెంటాద్రినగర్, లింగంపల్లి, పోచమ్మ టెంపుల్ ఏరియా, పీజేఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ప్రాంతం, శివాజీనగర్, తారానగర్ విలేజ్, విద్యానికేతన్ స్కూల్ వెనుక ప్రాంతం, తారానగర్ మసీదు ఏరియా, తెల్కార్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. శాంతినగర్, కడిమి హాస్పిటల్, హుడా కేఫ్ ప్రాంతాల్లో, జీహెచ్‌ఎంసీ విద్యానర్సింగ్ హోమ్, జీహెచ్‌ఎంసీ మీ సేవ లేన్, విద్యానర్సింగ్ ఏరియాల్లో ..
- హుడా కాలనీ ఫీడర్ పరిధిలో .. చందానగర్, హుడా కాలనీ ఏరియాల్లో..
- చందానగర్ ఫీడర్ పరిధిలో..చందానగర్ మెయిన్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి టెంపుల్, చెన్నారెడ్డి హాస్పిటల్, గీత థియేటర్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ..**

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హుండాయ్ ఆఫీస్, మాతా భువనేశ్వరి ప్రాంతం, ఎన్–కన్వెన్షన్ పరిసరాలు, హైటెక్‌సిటీ నుంచి యశోద ఆస్పత్రి ప్రధాన రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

- సీసీఆర్టీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సీసీఆర్టీ క్యాంపస్, రెయిన్‌బో ఆస్పత్రి, పరిసరాలు, న్యూ వైట్ ఫీల్డ్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

**మియాపూర్‌లో..**

మియాపూర్ : దీప్తిశ్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 వరకు మియాపూర్ పోలీస్ స్టేషన్ ఏరియా, ఫార్చ్యూన్ హైట్ అపార్ట్‌మెంట్, మదీనాగూడ మెయిన్ రోడ్డు, సాయినగర్ కాలనీ, కృష్ణ దేవరాయ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజుకుమార్ తెలిపారు.

**మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

రాంనరేష్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డేజ్ హోం, మిత్ర హిల్స్, ప్రశాంత్ నగర్, ఏఎస్ రాజునగర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వెర్‌టెక్స్ ప్రైమ్ మెరిడియన్ ,ఫ్రీ విలేజ్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

## బెల్ట్‌షాపుపై దాడి..

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో సత్యనారాయణ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడని బుధవారం విశ్వసనీయ సమాచారం రావడంతో సంగారెడ్డి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు సాయిలు, పవన్ ఆకస్మికంగా దాడి చేసి దాదాపు 77,275 వేల లీటర్ల 282 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో మద్యాన్ని అప్పజెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు క్రైమ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## నేడు శివాలయంలో స్వచ్ఛ భారత్

కూకట్‌పల్లి: అయోధ్యలో ఈ నెల 22న రామ మందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాలన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కూకట్‌పల్లిలో స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో 18వ తేదీ కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులోని శివాలయం ప్రాంగణంలో స్వచ్ఛ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హిందూ బంధువులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## శ్రీరామ మూల మంత్ర హోమం

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవసన్నిధానంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహింపతలపెట్టిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీరామ మూలమంత్ర హోమం నిర్వహించారు. పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం కిష్కింధకాండ ప్రవచనాలు నిర్వహించారు. అయోధ్య సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని దైవసన్నిధానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. పూజా కార్యక్రమాలో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణతో పాటు కోమటిరెడ్డి లక్ష్మి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి


ఓటుహక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్

పటాన్‌చెరు టౌన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పట్టణంలోని మైత్రీ గ్రౌండ్ నుండి రామచంద్రాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈనెల 22 వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ తహసీల్దార్ గౌరీ వత్సల, పటాన్‌చెరు జీహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, పటాన్‌చెరు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్, విశ్వేశ్వర్, అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ బాలరాజ్ పాల్గొన్నారు.



## అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలు, గాంధీ శిల్ప జాతీయ మేళా బుధవారంతో ముగిశాయి. ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అంజు అరవింద్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన, వరంగల్‌కి చెందిన నాట్యగురువు తాడూరి రేణుక శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ఇందులో వినాయకకౌతం, బ్రహ్మాంజలి, అన్నమాచార్య కీర్తనలు, దశావతారాలు తదితర అంశాలను ప్రదర్శించారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ జర్నల్‌లో హెచ్‌సీయూ పరిశోధన వ్యాసాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థుల వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హెచ్‌సీయూలోని యాక్షన్ కంట్రోల్ అండ్ కాగ్నిషన్ ల్యాబ్ పరిశోధక విద్యార్థులు వైష్ణవిమోహితే, డాక్టర్ సీమాప్రసాద్, సెంటర్ ఫర్ కాగ్నిటివ్ సైన్సెస్(సీఎన్‌సీఎస్) హెడ్ ప్రొఫెసర్ రమేష్‌కుమార్ మిశ్రా కలిసి రూపొందించిన 'ట్యూనింగ్ అవుట్ ది నాయిస్: హౌ అవర్ బ్రెయిన్స్ ఇన్ ఏ డిస్ట్రాక్టెడ్ వరల్డ్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని రూపొందించగా దాన్ని అమెరికాలోని సైకోనామిక్ సొసైటీ యొక్క అటెన్షన్, పర్సెప్షన్ అండ్ సైకోఫిజిక్స్ జర్నల్‌లో ప్రచురితం కావడం విశేషం. ముఖ్యంగా 'శ్రద్ధ–పరధ్యానం మధ్య ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టగల సామర్థ్యం– మన వేగవంతమైన ప్రపంచంలో ఎంతో కీలకమని వారు ఈ పరిశోధనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మన మెదడు ఎలా నియంత్రిస్తాయనే దానిపై దృష్టి పెట్టారు. ' డిస్ట్రాక్టర్ సప్రెషన్' అనే శక్తివంతమైన సాధనాన్ని బహిర్గతం చేస్తుందని పరిశోధన ద్వారా తేల్చారు. రద్దీగా ఉండే వీధిని ఊహించుకొంటే మన మెదళ్లు తళతళలాడే లైట్లను, హారన్‌లను అణచివేయగలవని, తద్వారా మనం సురక్షితంగా రోడ్డు దాటడంపై దృష్టి పెట్టవచ్చని తేల్చారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.22 వేల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కందుకూరికి చెందిన మాల్యాద్రి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు పట్టణంలోని గౌతంనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు.ఈ క్రమంలో జనవరి 3వ తేదీన తన స్వగ్రామానికి మాలాద్రి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు.సంక్రాంతి పండుగ నేపథ్యంలో అక్కడే ఉండిపోయారు. 16వ తేదీ ఉదయం ఇంటి యజమాని వెంకటేశ్వర్లు, మాల్యాద్రికి ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడినట్లు సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం పటాన్‌చెరుకు చేరుకున్న మాల్యాద్రి ఇంటికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.22 వేల నగదు లేకపోవడంపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## వ్యక్తి అదృశ్యం


వెంకట్‌రావు

మియాపూర్: ఇంటినుండి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో నివాసముంటున్న అన్నూరి వెంకట్‌రావు(65) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు శ్రీనివాస్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జడ్‌సీని కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు


స్నేహ శబరీష్‌ను సన్మానించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, నాయకులు కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్కను అందించారు. అనంతరం జంట సర్కిళ్ళ పరిధిలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి , పెండింగ్ పనులపై చర్చించారు. గతంలో అభివృద్ధి పనులకు డివిజన్ల వారీగా రూ.8 కోట్లు మంజూరయ్యేవని, కానీ ప్రస్తుతం రూ.4 కోట్లు మాత్రమే మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆ నిధులు సకాలంలో రావడంలేదన్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులారఘునాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇతర దరఖాస్తులకు మోక్షమెప్పుడో?

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమై ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజా పాలనలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఆరు గ్యారంటీల కోసం అభయ హస్తం పథకం కింద మొత్తం 2,29,683 దరఖాస్తులు అందాయి.

- ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో 35,624, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో 47,697 దరఖాస్తులు అందాయి. ఇందులో ఆరు గ్యారంటీల కోసమే కాకుండా రేషన్ కార్డుతో పాటు ఇతర పథకాల కోసం ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో 1174, జూబ్లీ హిల్స్ సర్కిల్ పరిధిలో 2,097 దరఖాస్తులు అందాయి. అయితే అభయహస్తం దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తయ్యింది.
- ఇతర దరఖాస్తులకు మోక్షం ఎప్పుడు కలుగుతుందనేది ఇంకా తెలియదని సంబంధిత అధికారులు తెలిపారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర పథకాల అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం పది రోజుల పాటు ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులను స్వీకరించగా కొందరు మాత్రం గ్యారంటీ పథకాలతో పాటు ఇతర పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.
- అయితే ప్రభుత్వ ఆదేశాలు మాత్రం గ్యారంటీ పథకాలకు చెందిన దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించింది. దీంతో ఇతర వాటిని పక్కనపెట్టారు.
- ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో ఇతర పథకాల కోసం మొత్తం 12,506 దరఖాస్తులు అందాయి.
- ప్రస్తుతానికి వీటన్నింటినీ పక్కనబెట్టారు. ఇందులో 99 శాతం దరఖాస్తులు రేషన్‌కార్డు కోసమే వచ్చాయి. మిగతా ఒక శాతం దళితబంధు, బీసీ బంధు, ఆర్థిక సహాయం, కరెంటు, ఇతర సమస్యల పైన అందాయి. వీటన్నింటినీ జోనల్ కార్యాలయంలో భద్రపరిచారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ప్రతి సంక్షేమ పథకం వీటితోనే ముడిపడి ఉండటంతో అర్హులైన వారంతా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.
- అయితే ఈ దరఖాస్తులను ఏమి చేయాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా భద్రపరిచారు.
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను గ్యారంటీ పథకాలకు మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేశామని అధికార వర్గాలు చెబుతున్నాయి. తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు దరఖాస్తులను పరిశీలిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.